ఉపాధ్యాయులను నియమించాలని యుటిఎఫ్ వినతి


వినతి అందిస్తున్న ఉపాధ్యాయులు

నరసాపురం: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయలను నియమించాలని యుటిఎఫ్ నేతలు ఎంఇఒ పి.పుష్పరాజ్యంకు శనివారం వినతిపత్రం అందించారు. స్కూళ్ల ప్రారంభంలో అడ్మిషన్ల డ్రైవ్ నిర్వహించడం వల్ల విద్యార్థుల సంఖ్య గతం కంటే పెరిగిందని, దానికి అనుగుణంగా కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. దీనిపై ఎంఇఒ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కార్యదర్శి కృష్ణకుమారి, మండల ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, నేతలు పి.శ్యాంసన్, ఎస్‌వి.సత్యనారాయణ, రాజశ్రీ, కె.కళ్యాణి పాల్గొన్నారు.

ఖరీఫ్ కష్టాలు..!

రెండు జిల్లాల్లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో వరిసాగు

'ఏలూరు'లో 47 వేలు, పశ్చిమలో 50 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి

సాగునీటి కోసం రోడ్డెక్కుతున్న రైతులు

కృష్ణా ఆయకట్టులో బీటలు వారుతున్న నారుమళ్లు

దాదాపు 30 వేల ఎకరాల్లో సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన

మందకొడిగా కౌలుకార్డుల జారీ, రుణాల అందజేత


యలమంచిలి మండలంలో ఎండుతున్న పొలాలు

ఖరీఫ్ సాగులో అన్నదాత అష్టకష్టాలు పడుతున్నాడు. సాగునీటి కోసం రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి దాపురించింది. వానలు లేక, సాగు నీరందక ఖరీఫ్ సాగు రైతులకు కత్తి మీద సాములా మారింది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలోని కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాగు నీరందక రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో 2.22 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఇప్పటి వరకూ 47 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. పశ్చిమలో 2.15 లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సన్నద్ధమవ్వగా, 50 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వానలు కురవకపోవడంతో సాగునీటి కోసం రైతులు పడుతున్న అవస్థలు చెప్పలేనివిగా మారాయి. డెల్టా ప్రాంతంలో సైతం సాగునీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 30 వేల ఎకరాల మేర కృష్ణా ఆయకట్టు ఉంది. కృష్ణా కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగుకు వేసిన నారుమడులన్నీ బీటలు వారుతున్నాయి. దీంతో తమకు సాగునీరు అందించాలంటూ రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. గోదావరి నుంచి వచ్చే నీటిని కృష్ణా ఆయకట్టుకు తరలించే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఆలోచించాలని రైతులు కోరుతున్నారు. పట్టిసీమ నుంచి కృష్ణాకు నీటిని తరలిస్తున్నా జిల్లాలోని కృష్ణా ఆయకట్టుకు మాత్రం సాగునీరు అందించని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ సాగు ఆదిలోనే ఈ విధంగా ఉంటే ముందు పరిస్థితి ఏమిటనే భయం అన్నదాతను వెంటాడుతోంది. డెల్టా ప్రాంతంలోనూ సాగునీరు కోసం రైతులు ఆయిల్ ఇంజిన్లు వాడాల్సి రావడంతో ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో సాగు పెట్టుబడి పెరిగిపోతుంది. ఎండల తీవ్రతకు నాట్లు సైతం దెబ్బతింటుండటంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు.

మందకొడిగా కౌలుకార్డుల జారీ, రుణాలు అందజేత

రెండు జిల్లాల్లో మూడు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉన్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. అయినప్పటికీ కౌలుకార్డుల జారీకి సంబంధించి తీసుకున్న టార్గెట్లు మాత్రం రెండు జిల్లాల్లో తక్కువగా ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 75 వేలు కౌలుకార్డులు జారీ చేయాలని టార్గెట్ తీసుకోగా, ఇప్పటి వరకూ 42 వేల కార్డులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల కౌలుకార్డులు జారీ చేయాలని టార్గెట్ తీసుకోగా 60 వేల కార్డులు వరకూ జారీ చేసినట్లు తెలిసింది. రుణాల మంజూరు మరింత మందకొడిగా సాగుతోంది. ఏలూరు జిల్లాలో కౌలురైతులకు రూ.375 కోట్లు పంట రుణాలుగా ఇవ్వాలని టార్గెట్ నిర్ణయించగా, ఇప్పటి వరకూ రూ.8 కోట్లు మాత్రమే అందించారు. పశ్చిమగోదావరి జిల్లాలో కౌలురైతుల రుణాల మంజూరు పరిస్థితి నామమాత్రంగానే ఉంది. దీంతో కౌలురైతులు ఖరీఫ్ పెట్టుబడుల కోసం నానాతంటాలు పడుతున్నారు. నాట్లు నాటిన రైతులు కూలీలకు, ట్రాక్టర్ దమ్ముకు ఇచ్చేందుకు సొమ్ములు లేక ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంటరుణాలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అంతా కోరుతున్నారు. కార్డుల జారీ త్వరితగతిన పూర్తిచేసి రుణాలు అందిస్తేనే కౌలురైతులకు మేలు జరిగే పరిస్థితి ఉంది. లేకపోతే కౌలురైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో నలిగిపోక తప్పదు.

ఇరిగేషన్ మంత్రివర్యా.. నీళ్లేవీ

మంత్రి ఇలాకాలో నీరందక ఎండుతున్న నారుమళ్లు

ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు

పొలాల్లో బీటలను చూపుతున్న రైతులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని యలమంచిలి గ్రామ పరిధిలోని గొలెపర చెరువు గట్టు ప్రాంతంలో దేవుడు మాన్యం, తవ్వకోడు, తూములకోడు ఆయకట్టులో సాగునీరందక ఎండుతున్న నారుమళ్లకు తక్షణం నీరందించాలని ఏపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. గ్రామంలో ఎండిన నారుమళ్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సార్వా సాగుకు ఇంత దారుణ పరిస్థితి ఎన్నడూ లేదన్నారు. వందలాది ఎకరాల్లో నారుమళ్లు, పంటలు ఎండుతున్నా అధికారుల్లోనూ, ప్రజాప్రతినిధుల్లోను చలనం లేదని విమర్శించారు. సాక్షాత్తూ జల వనరుల శాఖ మంత్రి నియోజకవర్గంలో సైతం సాగునీరందక నారుమళ్లు ఎండిపోతున్నా.. ఇరిగేషన్, వ్యవసాయ శాఖ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే పంట పొలాలను పరిశీలించి సాగునీరు ఇవ్వాలని కోరారు. దీనిపై ఇరిగేషన్ డిఇ వెంకట నారాయణకు ఫోన్ చేసి మాట్లాడగా అధికారులను వెంటనే పంపుతామని, ఆ ప్రాంతానికి ప్రత్యేకంగా నీరందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు, రైతులు కవురు వెంకటసత్యనారాయణ, తమ్మినీడి కృష్ణార్జున, కవురు రామవెంకట సత్యనారాయణ, ఉండ్రు తాతయ్య, తంగెళ్ల వెంకటకృష్ణ, కొడవటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

21న సిడిపిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - భీమవరం

ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, ప్రీ స్కూల్స్ బలోపేతానికి చర్యలు చేపట్టాలని, అంగన్వాడీలు, లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 21న సిడిపిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీల జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి సుబ్బరావమ్మ మాట్లాడుతూ పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం, విద్య అందించాలనేది ఐసిడిఎస్ లక్ష్యమని తెలిపారు. అనేక యాప్‌ల వద్ద లబ్ధిదారులు అంగన్వాడీ కేంద్రాలకు దూరమవుతున్నారన్నారు. లబ్ధిదారులకు ఇచ్చే ఆహారం పంపిణీలో నిబంధనలు అంగన్‌వాడీలకు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. వెంటనే ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలన్నారు. ప్రీ స్కూల్‌కు అంగన్వాడీలు దూరమవుతున్నారని, ఇది ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధమన్నారు. దీనివల్ల చాలా నష్టం కలుగుతుందని, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా చేయాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె వీరోచిత పోరాటమని, అనేక జిఒలను సాధించుకోగలిగామని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులు, ఇంటి అద్దెలు వెంటనే చెల్లించాలన్నారు. అంగన్వాడీలను పెన్షన్ పంపిణీ విధుల నుంచి తప్పించాలన్నారు. అన్ని సరుకులూ ఒకేసారి ఇవ్వాలని కోరారు. ఈ నెల 21న జరిగే ధర్నాలో అంగన్వాడీలు, లబ్ధిదారులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, నేతలు హసీనా బేగం, కె.తులసి, పి.నాగరత్నం, శ్యామల, దుర్గా, పరమేశ్వరి, రూతు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - తణుకు

ప్లాస్టిక్ వాడకం వల్ల పెద్దఎత్తున పర్యావరణం దెబ్బతింటోందని, జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తణుకు మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సైన్స్ ఫేర్‌ను తిలకించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ తోపుడు బండ్ల వ్యాపారులు, పెద్దపెద్ద షాపులు, సూపర్‌మార్కెట్ల వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల బదులు జ్యూట్, క్లాత్ బ్యాగులు వినియోగదారులకు ఇవ్వాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్టీల్ లంచ్‌బాక్స్, స్టీల్ వాటర్ బాటిల్స్‌ను తప్పక వినియోగించాలని పిల్లలచే ప్రమాణం చేయించారు. మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహశీల్దార్ డివిఎస్ఎస్.అశోక్‌వర్మ, ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, ఎంపిడిఒ లోహిత్‌సాగర్, మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ప్రిన్సిపల్ ఎ.జ్ఞానమంజరి, పరిమి వెంకన్నబాబు, బసవ రామకృష్ణ, మంత్రిరావు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న నారుమళ్లు

సాగునీరందక రైతుల అవస్థలు

ఆస్తి పన్ను పెంపుతో రూ.1.10 కోట్లు ప్రజలపై అదనపు భారం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి ఎకరాకూ పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం నారుమళ్లు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. జిల్లాలో ఎనిమిది మండలాల్లో నారుమడులు బీటలు వారాయని, సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సార్వా సీజన్ ప్రారంభమై నారుమడులు, నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. జిల్లాలో చాలా మండలాల్లో నారుమడులకు, నాట్లకు నీరులేక రైతులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సొంత నియోజకవర్గంలోని యలమంచిలి మండలంలో సాగునీరు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆచంట, పోడూరు, పెనుమంట్ర, వీరవాసరం మండలాల్లో నారుమడులు బీటలు తీసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే తప్ప మరొకటి కాదన్నారు. దీనిని అధికారులు, ప్రభుత్వం ప్రకృతి వైఫల్యంగా దాటేయడం విడ్డూరమన్నారు. ఒకపక్క ఉత్తరాదిన వర్షాలతో గోదావరిలో నీటి ఉధృతి పెరిగిందని వార్తలొస్తున్నాయని, మరోపక్క రైతాంగానికి సాగునీరు లేదనడం అంటే ఇది ఎవరి వైఫల్యమో ఆలోచించాలని అన్నారు. వేసవిలో పంట బోదెలు, కాలువల్లో పూడిక తీయకుండా నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రతియేటా ఈ సమస్య ఎదురౌతుందన్నారు. ఒకపక్క ఎరువులు, విత్తనాల ధరలు విపరీతంగా పెరిగి పెట్టుబడి పెరిగిందని, మరోపక్క సాగునీరు అందక ఇంజిన్లతో వేలకు వేలు డీజిల్ కొనుగోలు చేసి సాగు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడిందన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఉత్పత్తి వ్యయం పెరిగిపోయి రైతులు వ్యవసాయం వదులు కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి సార్వాకు సాగునీటి కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రజానీకంపై రూ.1.10 కోట్లు అదనపు భారం

మోడీ తీసుకొచ్చిన మున్సిపల్ చట్ట సవరణ ఫలితంగా గత వైసిపి ప్రభుత్వ హయాంలో వచ్చిన విలువ ఆధారిత ఆస్తి పన్నుతో ప్రజలపై విపరీతంగా పన్నుల భారం పడిందన్నారు. ప్రస్తుతమున్న ఆస్తి పన్నుపై 20 శాతం పెంచాలనే ఆలోచనలో ఉన్నట్లు, దానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. అటువంటి ఆలోచనలను వెంటనే విరమించుకోవాలన్నారు. కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి భిన్నంగా ప్రజలపై భారాలు మోపడం తగదన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు !

గరగపర్రులో కానరాని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర - కలెక్టర్ ఆదేశాలు అధికారులు బేఖాతర్

గరగపర్రు యూనియన్ బ్యాంక్ రోడ్డులో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

భీమవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేస్తోంది. జిల్లాలో ఆరు నెలల క్రితమే ప్లాస్టిక్ నిషేధాన్ని ఉద్యమంగా ప్రారంభించి పటిష్టంగా అమలు చేస్తుంది. పశ్చిమ జిల్లాను ఆదర్శంగా తీసుకుని ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిషేధించాలని ప్రత్యేక కార్యక్రమాన్ని రూపకల్పన చేసి అమలుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం నినాదంతో కలెక్టర్ నాగరాణి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే కలెక్టర్ ఆదేశాలను పాలకోడేరు మండల పరిషత్ అధికారులు, గరగపర్రు పంచాయతీ అధికారులు బేఖాతర్ చేశారు. జిల్లా అంతటా ప్లాస్టిక్ నిషేధ కార్యక్రమం అమలు జరిగితే గరగపర్రులో మాత్రం కానరాలేదు. పాత పంచాయతీ భవనం రోడ్డు, యూనియన్ బ్యాంక్ వెళ్లే రహదారిలో చెత్త కుప్పలు ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా కనిపించాయి. ప్లాస్టిక్ నిషేధం ఒక్కరితో సాధ్యమయ్యేపని కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశాలు అధికారులు పెడచెవిన పెట్టారు. గ్రామంలో షాపుల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను అమ్ముతున్నప్పటికీ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు తప్ప నివారణకు పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో సర్పంచి, పాలకవర్గం సభ్యులు, కార్యదర్శి, విఆర్ఒ సచివాలయ ఉద్యోగులతో పాటు కేవలం 40 మంది మాత్రమే పాల్గొని మమా అనిపించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ పై అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ అదేమీ కనిపించలేదు. పర్యవేక్షించాల్సిన మండల పరిషత్తు అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలు లేవు. జిల్లా అంతటా జరిగిన ఉద్యమంల జిల్లా ప్రత్యేకాధికారులతో పాటు కలెక్టర్, ఉన్నతాధికారులు భాగస్వాములైతే పాలకోడేరు మండల పరిషత్ , గరగపర్రు పంచాయతీ అధికారులు ఉదాశీనంగా వ్యవహరించి కార్యక్రమం నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తాం

మున్సిపల్ కార్మికుల ధర్నాలు, సమ్మె నోటీసుల అందజేత - తాడేపల్లిగూడెంలో రెండో రోజు కొనసాగిన సమ్మె

భీమవరంలో..

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి, వారి సమ్మెను విరమింపజేయాలని, లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా మున్సిపాల్టీల్లో ఇంజినీరింగ్ కార్మికులు పని చేస్తున్నారని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గత సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాల్టీలో కార్మికులపై అదనపు భారం తగ్గించాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీలోపు సమస్యలు పరిష్కరించకపోతే భీమవరం మున్సిపాల్టీలో ఈ నెల 23వ తేదీ నుండి సమ్మె చేస్తామని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన సమ్మె నోటీసు మున్సిపల్ మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, నీలాపు అప్పన్న, ధనాల చినపెద్దిరాజు, మాడుగుల రత్నం, మాడుగుల పద్మావతి, రాయవరపు మావుళ్లు, మామిడి శివకుమార్, చిన్ని కుమార్ రాజు, నాగమణి, బొత్స మోషే తదితరులు పాల్గొన్నారు.

తణుకు: మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేనిపక్షంలో సోమవారం నుండి సమ్మెలోకి వెళ్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మేనేజర్ చంద్రశేఖర్‌కు నోటీసులు అందజేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నెం.36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ ఇవ్వాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలివ్వాలని, కార్మికుల రిటైర్‌మెంట్ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని నినదించారు. ధర్నానుద్దేశించి ప్రతాప్, యూనియన్ కార్యదర్శి నీలాపు ఆదినారాయణబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిటీ ప్రకటించి మున్సిపల్ కార్మికులకు జిఒఆర్‌టి నెంబర్ 1615 అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నేత

తణుకులో..

గార రంగారావు, యూనియన్ అధ్యక్షులు అర్జి కృష్ణబాబు, నేతలు డి.గంగాధర్, ఇ.సుధాకర్, ఎస్.పద్మ, కె.రమణ, జి.పుష్ప, కె.అయ్యప్ప, వై.మందులయ్య, పి.జ్యోతిబాబు, ఎ.మల్లేశ్వరి, కె.రాజేశ్వరి, కె.కృష్ణారావు, బి.పైడమ్మ, కె.రాణి, కె.సత్యనారాయణ, ఎన్.పండు, టి.దుర్గ, ఎన్.నాగరాజు, వి.రమేష్, కె.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

గూడెంలో కొనసాగిన సమ్మె

తాడేపల్లిగూడెం: కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకట్రావు, నేతలు ధనాల రాజు, తాడికొండ జయరామకృష్ణ, కొడమంచిలి ప్రసాద్, ఎస్.సతీష్, తాడికొండ భాను, కె.దయామణి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండి : సిపిఎం

తాడేపల్లిగూడెం: స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టాలని పట్టణ ప్రజలకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం రెండో రోజు అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పట్టణంలోని భాగ్యలక్ష్మీపేట, సీతారాంపేట, నరసింహారావుపేట, నవ్వారుపేట వార్డుల్లో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇదే ప్రయత్నం చేస్తే స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులకొట్టండని నాడు నారా లోకేష్ తదితర నేతలు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. తీరా అధికారంలోకొచ్చాక అవే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, దుకాణాలకు స్మార్ట్‌మీటర్లు బిగించారని, వాటి కరెంటు బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం ఆపాలన్నారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, పక్కుర్తి చిన్న అప్పారావు, నగిరెడ్డి సాయి, కొమ్మిరెడ్డి ఉదయ్, నాగిరెడ్డి సాయి, వి.అప్పారావు, పి.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాజ్

ప్రజాశక్తి - ఆచంట

గత కొంతకాలంగా ఉండి నియోజకవర్గంలో దళితులు నివసిస్తున్న ఇళ్లను అక్రమంగా కూల్చివేయడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఆకివీడులో పర్యటిస్తారని ఆచంట వేమవరం మాల మహానాడు కార్యాలయం వద్ద ముందస్తుగా పుష్ప రాజ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆకివీడు మండలంలోని ధర్మపురం అగ్రహారంలో ఏ విధమైన నోటీసులు లేకుండా 27 మందికి విద్యుత్ మీటర్లు గతంలో తొలగించారన్నారు. ఈ విషయంపై పోరాటం చేసి విద్యుత్ కనెక్షన్లు ఇప్పించామన్నారు. ప్రభుత్వం కక్షపూరితంగా దళితులు నివాసముంటున్న ఇళ్ల వల్ల రహదారికి ఎలాంటి ఇబ్బంది లేకపోయినా కావాలని కోర్టుకు వెళ్లి ఇళ్లు తొలగించాలని ఆర్డర్ తెచ్చుకుందని, కోర్టు తీర్పును తాము శిరసావహిస్తామని తెలిపారు. అక్కడున్న దళిత కుటుంబాలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా స్థలాలు ఇళ్లు కట్టించి ఏర్పాటు చేయాలని కోరారు. రానున్న రోజుల్లో వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని లేకపోతే రానున్న రోజుల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఉద్యమం చేబడతామని పుష్ప రాజ్ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

చెరువు గట్టు ఇళ్ల తొలగింపు

ఆకివీడు : ఆక్రమణల తొలగింపులో భాగంగా పట్టణ శివారు ధర్మపర అగ్రహారంలోని తాగునీటి చెరువు గట్టుపై ఉన్న నిర్మాణాలను అధికారులు శనివారం తొలగించారు. ఈ చెరువు గట్టున సుమారు 30 కుటుంబాల వారు చాలా కాలంగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అయితే గత సంవత్సరం నగర పంచాయతీ అధికారులు ఈ ఇళ్లు తీసేయాలంటూ నివాసులకు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను సవాల్ చేస్తూ నివాసులు హైకోర్టుకు వెళ్లారు. అయితే హైకోర్టు వారి అప్పీల్‌ను కొట్టేసింది. వెంటనే ఇళ్లను తొలగించాలని నగర పంచాయతీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీంతో అధికారులు వారం రోజులు క్రితం మరోసారి నోటీసులు జారీ చేశారు. ఎవరు ఖాళీ చేయకపోవడంతో శనివారం పొక్లెయినర్‌తో ఇళ్ల తొలగింపు ప్రారంభించారు. సిఐ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు నడుమ నిర్వహించారు.

చించినాడలో మహిళా రైతుపై దౌర్జన్యం

కత్తులు, రాడ్లతో రౌడీ మూకల బెదిరింపు

యలమంచిలి : చించినాడ గ్రామానికి చెందిన మహిళా రైతు కలిదిండి పద్మావతిపై శనివారం రౌడీ మూకలు కత్తులు, రాడ్లతో దౌర్జన్యం చేసిన సంఘటన చుట్టుపక్కల వారిని కూడా భయభ్రాంతులకు గురు చేసింది. బాధితురాలు పద్మావతి తెలిపిన వివరాల ప్రకారం.. చించినాడ బ్రాంచి కాలువ సమీపాన ఉన్న తన పంట పొలంలో శనివారం ఉదయం కూలీల చేత నాట్లు వేయిస్తుండగా తన పొలాన్ని ఎప్పటి నుండో దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని కుట్రలు చేస్తున్న తండ్రీ కొడుకులు నంబూరి సత్య సూర్యనారాయణరాజు, నంబూరి రామభద్ర రాజు రౌడీ మూకలను ప్రోత్సహించి పొలం వద్ద ఉన్న తనతోపాటు కూలీలపై కత్తులు, రాడ్లతో దాడి చేయడానికి ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే యలమంచిలి పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రౌడీ మూకలు అక్కడి నుండి పరారయ్యారని తెలిపింది. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలితో పాటు స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎంపిడిఒ కిరణ్‌కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఓఎస్‌డిగా బదిలీపై వెళ్తున్న ఎంపిడిఒ కిరణ్‌కుమార్‌ను, పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మండలంలో ఎంపిడిఒగా తక్కువ కాలం పని చేసి అందరి మన్ననలు పొందిన అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. ఆయన మరిన్ని ఉద్యోగోన్నతులు పొంది జిల్లాస్థాయిలో సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రతి ఉద్యోగి గ్రామస్తులు అభినందించేలా విధులు నిర్వర్తించాలని పంచాయతీ కార్యదర్శులనుద్దేశించి అన్నారు. అనంతరం ఓఎస్‌డి కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు భూసారపు శ్రీనివాస్, మహేష్, నరేంద్ర, శ్రీనివాస్, రమేష్‌ను సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయులు, సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిటిసి అంగర కుసుమ సుబ్బారావు, ఇందిర, ఉష, జ్యోత్స్నదేవి, సూపరింటెండెంట్ అప్పారావు, ఇఓపిఆర్‌డి సత్యనారాయణమూర్తి, వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

వీరవాసరం: వడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం భోజనం ప్లేట్లు అందజేశారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బొమ్మ శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో యాభై మంది విద్యార్థులకు రూ.ఐదు వేల విలువ చేసే ప్లేట్లు సర్పంచి సైదు శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని భవాని, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ అమ్మాజ్యోతి, మద్దాల తాతారావు, అనిల్‌కుమార్, కరక సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపవరం : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆరో వార్డులో ఉన్న మండల పరిషత్ పాఠశాలకు కుర్చీలు అందజేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, కోశాధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో భారీ వర్షం

పాలకొల్లు: పాలకొల్లులో శనివారం సాయంత్రం గంటన్నర పాటు వర్షం దంచి కొట్టింది. దీంతో వారపు సంతలో కొనుగోలు దారులు తడిసి ముద్దయ్యారు. వర్షం కారణంగా ఇంటికి వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు కూడా తడిసి ముద్దయ్యారు. 2 రోజులుగా ఊరిస్తున్న వర్షం దంచికొట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షానికి దాదాపు అన్ని రోడ్లు, డ్రైనేజీ ఏకమై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఉచిత శిబిరం వాయిదా

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 21వ తేదీ సోమవారం పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్ద జరగనున్న వికలాంగ, వృద్ధులకు సహాయ పరికరాలు అందజేసే ఉచిత శిబిరం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపిడిఒ బిఎస్ఎస్ కృష్ణమోహన్ శనివారం విలేకరులకు తెలిపారు. ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాలకు చెందిన వికలాంగులు పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్దకు రావద్దని తెలిపారు.

పెనుగొండ : 21న వికలాంగ, వృద్ధులకు సహాయ పరికరాలు అందించే ఉచిత శిబిరం వాయిదా పడిందని ఎంపిడిఒ డి.సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా వారి సౌజన్యంతో భారత ప్రభుత్వం కృత్రిమ అవయవాలు తయారీ సంస్థ ద్వారా వారికి ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఛాంబర్ విద్యార్థులకు యూనిఫారాలు అందజేత

పాలకొల్లు : పాలకొల్లు కెవిఎం ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో పేద విద్యార్థులకు శనివారం దాతల సహకారంతో ఒక్కో జత యూనిఫారం ఉచితంగా అందజేశారు. పట్టణానికి చెందిన రేపాక సత్రం ఛైర్మన్ రేపాక శ్రీమన్నారాయణ చేతుల మీదుగా 100 జతలు, శ్రీ అత్తుం సుబ్బయ్య సత్రం ఛైర్మన్ అత్తుం సుబ్రహ్మణ్యం, వారి కుమారుడు వంశీ చేతులమీదుగా 100 జతలు, మన్యం జగ్గమ్మగారి సత్రం వారి మనవలు అడ్డేపల్లి మోహనదాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సిబ్బంది 100 జతలు, శ్రీభావం అద్దంగా సమాజం తరఫున తెనాలి కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సిబ్బంది కుమార్ చేతులమీదుగా 120 జతలు దాతలు అందజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ కారుమూరి వెంకట రత్న నరసింహారావు అధ్యక్షత వహించగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవి.సీతారామరాజు, ట్రెజరర్ రేపాక ప్రవీణ్ భాను, అకడమిక్ అడ్వయిజర్ ఎవిఎస్ మూర్తి, నందుల సీతారామరావు పాల్గొన్నారు. దాతలను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ సత్కరించారు.

పాలకొల్లు రూరల్: పందిరిగుంట ఎంపిపి స్కూల్ విద్యార్థులకు కలంపూడి వాసులు పోతాబత్తుల బుచ్చిరాజు అందించిన టై షర్టులు ఉపాధ్యాయుడు రాయపూడి భవానీ శంకర్ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్ మాట్లాడారు. విద్యార్థులందరూ వాటిని వినియోగించుకోవాలన్నారు.

గణపవరం: పాఠశాలకు 50 వేల విలువైన పర్నీచర్ అందజేయడం హర్షించదగ్గ విషయమని జల్లికొమ్మర సర్పంచి కురెళ్ల వెంకటరత్నం అన్నారు. కొమ్మర గ్రామానికి చెందిన మొగమట్ల నాగ సీతారాముడు, కురెళ్ల సత్తిరాజు 20 కుర్చీలు, బీరువ, ఆఫీస్ టేబుల్ అందజేయడం పట్ల పాఠశాల హెచ్‌ఎం కటకం సుందర్‌కుమార్, ఛైర్మన్ పుప్పాల ప్రకాశరావు సంతోషం వ్యక్తం చేశారు. సొసైటీ అధ్యక్షులు మద్దాల మహంకాళి, మాజీ సర్పంచి కోదండ రాంబాబు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో సిపిఎం జిల్లా సమావేశాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

సిపిఎం జిల్లా స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు కోరారు. ఈ నెల 21, 22 తేదీల్లో సమావేశాలు పాలకొల్లు ఎర్ర వంతెన వద్ద ఉన్న కోకోనట్ మార్చంట్ భవనంలో జరగనున్నాయన్నారు. ఈ సమావేశాల్లో రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొని క్లాసులు చెబుతారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు పాల్గొంటారని తెలిపారు.

డేవిడ్ రాజుకు రంగనాధరాజు అభినందన

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన పాస్టర్ బి.డేవిడ్‌రాజుకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాధరాజు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చెరుకువాడ శ్రీరంగనాధరాజు మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాలతో పాటు క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ఈ ప్రభుత్వంలో క్రిస్టియన్లపై దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకూ జగన్మోహన్ రెడ్డి సమన్యాయం చేశారని కొనియాడారు. సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారాం, వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు, యల్లమెల్లి రాజేష్, మట్టా ఆనంద్ కుమార్, పాస్టర్లు పోలుమూరి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఉత్తమ పిఎంశ్రీ పాఠశాలగా 'అంబేద్కర్ గురుకులం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉత్తమ పిఎంశ్రీ పాఠశాలగా పెద్దతాడేపల్లి బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎంపికైనట్లు ఎపిసి పి.శ్యామ్‌కుమార్ తెలిపారు. శనివారం ఎంఇఒలు వి.హనుమ, పిఎం కె.జ్యోతి, ఎఎంఒ (2) సుబ్రహ్మణ్యం, పిఎంఎస్ ఆర్‌ఐ వీరాస్వామి బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. కిచెన్ గార్డెన్, కంప్యూటర్ ల్యాబ్, ఆటస్థలం, సైన్స్ ల్యాబ్, కెరీర్ గైడెన్స్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌లు, ఫర్నీచర్ తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లాలోని 25 పిఎం శ్రీ పాఠశాలలను పరిశీలించి పెదతాడేపల్లి గురుకుల పాఠశాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి రూ.5 లక్షలు, రసాయనశాస్త్ర ప్రయోగాల కోసం రూ.13 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఎపిసి శ్యాం కుమార్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

తాడేపల్లిగూడెం: ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎస్‌పి డి.విశ్వనాథ్, పట్టణ సిఐ ఆదిప్రసాద్, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, ఎస్‌ఐ బి.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిత్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నేరాలు, డ్రగ్స్ వంటి అంశాలపై ప్రతి విద్యార్థి అవగాహన ఉండాలన్నారు. ప్రిన్సిపల్ పిఎల్.సరోజ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ కుటుంబం పట్ల బాధ్యతగా ఉండాలి. మొబైల్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. డిఎస్‌పి విశ్వనాథ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయనిన్నారు. మోసాలు జరిగితే భయపడకుండా వెంటనే 1930 లేదా 1972 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు మాట్లాడుతూ ఈగల్ గ్రూప్ అనే స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్వాన్‌కు ఎంఎల్‌ఎ అభినందన

తణుకు: తణుకుకు చెందిన చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వావిలాల సరళాదేవి, వెంకటరమేష్ మనుమడు నిర్వాన్‌ను ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. ఉమాన్ కోర్సులో అమెరికా వ్యాప్తంగా 11వ ర్యాంకు సాధించి భారతదేశ కీర్తిని రెపరెపలాడించారని కొనియాడారు. ఈ కోర్సు విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించుకోవడానికి దోహదపడుతుందని అన్నారు. నిర్వాన్ తల్లిదండ్రులు కీర్తి, ఉన్నికృష్ణకు అభినందనలు తెలియజేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఆచంట

గ్రామ పంచాయతీలు చెత్త నుంచి సంపద సమకూర్చుకోవడం ద్వారా గ్రామాలు బలోపేతం అవుతాయని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ అన్నారు. కాపులపాలెంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం తడి, పొడి చెత్త సేకరణపై ఎంపిడిఒ మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నరసింహారావు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడేన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా అభివృద్ధి చేయడానికి ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా తాలూకా ఆఫీస్ సెంటర్ నుండి పోలీస్ ఐలాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ ఐలాండ్ వద్ద మానవహారం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నేటి నుంచి తాడేపల్లిగూడెంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని, ప్లాస్టిక్‌ను వినియోగిస్తే రూ.10,000 జరిమానా విధిస్తామన్నారు.

గణపవరం : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా స్థానిక పంచాయతీ పిహెచ్‌సి వద్ద ప్లాస్టిక్ నిషేధంపై డిప్యూటీ ఎంపిడిఒ పి.సత్యనారాయణ, డాక్టర్ కె.ఓంకార్‌నాద్ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి స్థానికులకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మూరా అలంకారం, పంచాయతీ కార్యదర్శి డిఎస్‌ఆర్.ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : గ్రామంలో స్వచ్ఛమైన పరిసరాల కోసం అందరూ సహకరించాలని జుత్తిగ సర్పంచి తమనంపూడి వీరారెడ్డి అన్నారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచి జి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిమెట్ల సుబ్బలక్ష్మి, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ కర్రి శ్రీవల్లి, అంగన్వాడీ పాల్గొన్నారు.

నరసాపురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండొచ్చని కమిషనర్ అంజయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రపై ప్రదర్శన చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

కేంద్ర సహాయ మంత్రికి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ వినతి

భీమవరం : కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మకు ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.ఝాన్సీ లక్ష్మి, డి.కళ్యాణి, జిల్లా సహాయ కార్యదర్శి ఎండి హసీనా బేగం సమస్యలను మంత్రికి విన్నవించారు. అంగన్వాడీ సెంటర్ల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక యాప్‌లు పెట్టడం వల్ల ప్రీస్కూల్ ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

కార్మికుల సమస్యలపై విస్తృత పోరాటాలు

సిఐటియు మండల మహాసభ పిలుపు

వీరవాసరం: మండలంలో ఉద్యోగ, కార్మిక, స్కీమ్ వర్కర్ల సమస్యలపై మరిన్ని విస్తృత పోరాటాలు నిర్వహించాలని సిఐటియు మండల నాలుగో మహాసభ పిలుపునిచ్చింది. శనివారం యుటిఎఫ్ హాల్లో డి.వరలక్ష్మి అధ్యక్షతన మహాసభ జరిగింది. మహాసభకు సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ సిఐటియు మహాసభలు అఖిల భారత స్థాయి నుంచి మండల స్థాయి వరకూ ప్రతి మూడు సంవత్సరాలకూ జరుగుతాయని అందులో భాగంగా వీరవాసరం మండల నాలుగో మహాసభ జరుగుతోందన్నారు. సిఐటియు నీడ కింద ఉన్న సంఘాలన్నింటినీ రానున్న కాలంలో మండల స్థాయిలో ఏకం చేస్తామన్నారు. ఉపాధి కోల్పోతున్న రైస్ మిల్లు కార్మికులు, ఆక్వా కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల రిపోర్టును మండల కార్యదర్శి పి.నాగరత్నం వివరించారు. ఈ సందర్భంగా సిఐటియు నూతన మండల సమన్వయ కమిటీ ఏర్పడింది. కన్వీనర్‌గా డి.వరలక్ష్మి, కో కన్వీనర్‌గా బి.సత్యవతి మరో 19 మందితో కమిటీ ఏర్పడింది. మహాసభలో బజారు జట్టు కార్మిక సంఘం నాయకులు గిద్ద శ్రీనివాస్, అంగన్వాడీ రంగం నుంచి వై.వెంకటలక్ష్మి, కాశీ అన్నపూర్ణ, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు సంతోష్ వాణి, దుర్గ, మిడ్ డే మీల్ సంఘం నాయకులు కె.వెంకటరమణ, పైడికొండల నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు బాలకృష్ణ, నాగరాజు పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న నేతలు

కనకాయలంక బ్రిడ్జి నిర్మాణానికి రూ.23 కోట్లు మంజూరు

మంత్రి నిమ్మల చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - యలమంచిలి

కనకాయలంక గ్రామ కాజ్ వేపై బ్రిడ్జి నిర్మాణానికి జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కృషితో రూ.23 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం కనకాయలంకలో కూటమి నాయకుల సారథ్యంలో మంత్రి నిమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ముస్కుడి రాంబాబు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఎవరి వల్లా కాని కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణం మంత్రి నిమ్మల వల్లే సాధ్యమైందన్నారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ముద్దాయిలు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - తణుకు

ముద్దాయిలు నేర ప్రవృత్తిని విడనాడి, సత్ ప్రవర్తన కలిగి ఉండాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. శనివారం తణుకు సబ్‌జైల్‌ను సందర్శించి రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిమాండ్ ముద్దాయిలకు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే మండల న్యాయసేవల కమిటీ తణుకు వారి ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. న్యాయమూర్తి ప్రిన్సిపల్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీసాయిరాం పొతర్లంక, జైలు విజిటింగ్ న్యాయవాది ఎస్‌కె మోతీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలిఅడుగు

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

గత పాలకులు ఐదేళ్లలో చేయని అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిందని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తెలిపారు. వడలి, సిద్ధాంతం, పెనుగొండ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు నిర్వహించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, చింతపల్లి గన్ని రాజు, మండల అధ్యక్షులు గుత్తుల లోకేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

పెనుగొండ శివారు చెరుకువాడలో గంజాయి విక్రయాలు పెరిగిపోతునాయని, వాటిపై ఉక్కుపాదం మోపాలని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఎస్ఐ కొప్పిశెట్టి గంగాధర్‌ను ఆదేశించారు. పెనుగొండలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంజాయి విక్రయించేవారు ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇటీవల గ్రామ శివారు చెరుకువాడలో ఆరు దొంగతనాలు జరిగాయని, పోలీసులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని స్థానికులు ఆరోపించారు. పోలీసులు గస్తీ నిర్వహించాలని ఎంఎల్‌ఎ ఆదేశించారు.

ఉండి: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు అన్నారు. శనివారం వెలివర్రులో ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆదేశాల మేరకు గ్రామ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వెంకటేశ్వరరాజు, మండల అధ్యక్షులు నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి జివి.సత్యనారాయణ మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మైనార్టీ సలహాదారులు ఎంఎ షరీఫ్ అన్నారు. శనివారం చామకూరిపాలెంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజుతో కలిసి సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్, పొత్తూరి, కొల్లు మాట్లాడారు. పేదలకు సంక్షేమం, మహిళలకు ఆర్థిక స్థిరత్వం, యువతకు ఉపాధి కల్పించాలన్నదే సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. వాతాడి ఉమా, హరిచంద్ర, శ్రీను, రామకృష్ణ, నర్సింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర సొసైటీ ఛైర్మన్‌గా సురేష్

ప్రజాశక్తి - పెనుమంట్ర

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని పెనుమంట్ర సొసైటీ ఛైర్మన్ జవ్వాది సురేష్ తెలిపారు. పెనుమంట్ర సొసైటీకి ఛైర్మన్‌గా ఎంపిక చేసిన ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీకి గతంలో వచ్చిన చెడ్డ పేరు తొలగిపోయి, తిరిగి అభివృద్ధి పథంలో నడిచేలా త్రిసభ్య కమిటీ పనిచేస్తుందని తెలిపారు.

జుత్తిగ సొసైటీ ఛైర్మన్‌గా రాంబాబు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతులందరికీ సమన్యాయం చేస్తామని జుత్తిగ పిఎసిఎస్ ఛైర్మన్ వీరవల్లి రాంబాబు అన్నారు. టిడిపిలో చిరకాలంగా సేవలందిస్తున్న నేపథ్యంలో ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని రైతుల ప్రగతి కోసం, సొసైటీ అభివృద్ధి కోసం వినియోగిస్తానని తెలిపారు.

In the Court of the Senior Civil Judge at Amalapuram
O.S. 98/2015

Between:
1. V.V.Subrahmanya Sarma (died) Lr's
2. T.Bala Tripura Sundari & Others ***...Plaintiffs***

AND

Indraganti Indira @ Dasaraju & Others ***...Defendants***

Notice U/Or 20 R 5 CPC

పై దావా గ్రంథంలో 7వ ప్రతివాది అయిన విస్సాప్రగడ లవకుమార్ గారు చనిపోయినందున వారి వారసులు అయిన 1. విస్సాప్రగడ విశాలాక్షి మరియు వారి కుమార్డు విస్సాప్రగడ శ్రీ చరణ్ లను పార్టీలుగా చేర్చుమని కోరుతూ వేసిన పిటీషనులో శ్రీ కోర్టు వారి ఆదేశానుసారము వారికి తెలియజేయునది వారికి తెలియచేయునది. **ది. 25-7-2025వ తేదీన** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై వారి అభ్యంతరములను తెలియచేయవలెను. లేని యెడల వారి పరోక్షంలో తీర్మానం జరుగునని తెలియచేయడమైనది.

(By Order of the Hon'ble Court)

K.L.R.PRAKASH
Advocate, Notary
Rajahmundry — Rajahmundry
12-7-2025 — Cell: 8639631123

మహారాజశ్రీ మూడవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు
I.A.280/2024
O.S.332/2024

బిట్వీన్:
గోనినేని పద్మశ్రీ ..Plaintiff
And
వీరవాసరపు నాగ సత్యకిరణ్ కుమార్ ...ప్రతివాది

Plaintiff దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన వీరవాసరపు నాగ సత్య కిరణ్‌కుమార్ తండ్రి సూర్యనారాయణ, ప్లాట్‌నెం. T2, దేవాయి స్వర్ణ రెసిడెన్సీ, 4th ఫ్లోర్, RTC కాలనీ, సత్రంపాడు, ఏలూరు అను వారు పై నెంబరు గల దావాలో మరియు I.A.No.280/2024 లో ది. **30-07-2025** పై కోర్టులో ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల తమ పరోక్షమున తీర్మానం చేయబడును.

N.RAMU
Advocate, R.R.Pet,
Eluru-2. Cell:994831244

నోటీసు
ఇన్.ది.కోర్టు ఆఫ్ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు
ఒ.ఎస్.నెం.463/2024

బిట్వీన్ :
శ్రీ సాయికృష్ణ ఏజెన్సీస్
రిప్రజెంటెడ్ బై ప్రొప్రైటర్ M.N.V.మురళీకృష్ణ ...వాది
And
శ్రీ సత్యనారాయణ, ఇరిగేషన్స్, ప్రొప్రైటర్ కె.మోహన్ కుమార్ ...ప్రతివాది

To.
సత్యనారాయణ, ఇరిగేషన్స్, ప్రొ.కె.మోహన్ కుమార్, వేగివాడ, పెదవేగి మండలం.

పై దావాలో మీరు ఉద్దేశ్యపూర్వకముగా కోర్టు సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం **ది.31-07-2025**వ తేదీన ఉదయం 10.30 గంటలకు పైకోర్టు నందు మీరు స్వయంగా గాని లేక వకీల్ ద్వారా గాని హాజరై పై దావా నందలి మీ ఆక్షేపణలు తెలియపరచుకునేది, లేని యెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును, అని తెలుసుకునేది.

ఏలూరు — **వి.హర్షవర్ధన్**
తేది. 19-07-2025 — అడ్వకేట్, ఏలూరు.

ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నర్సాపురం వారి కోర్టులో
H.M.O.P.No.137/2024

బిట్వీన్:
వానా రాజశ్రీ అనే తాళ్ల రాజశ్రీ ...Petitioner
అండ్
వానా సురేష్‌కుమార్ ...Respondent

టు,
వానా సురేష్, తండ్రి గంగాధర్ రావు, వాలమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.

పై నంబరు పిటిషనులో పిటిషనరు మీ నుండి విడాకులు కోరుతూ పై కోర్టులో దాఖలు చేసి, పై కోర్టు నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు పిటిషనరును ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ్యంలో నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. అందుకు శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం Substitute సర్వీస్ గా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు ది. **7-8-2025** సం. తేదీన వాయిదా వేసియున్నారు. కావున ది. **7-8-2025** సం.తేదీన ఉదయం 10 గంటలకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని శ్రీకోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనయెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

గూడూరి శంభూప్రసాద్
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం/పాలకొల్లు
తేది. 16-07-2025 — సెల్: 9490988095

నోటీసు
మహారాజశ్రీ ఏలూరు అడిషనల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టు
ఇ.ఎ.నెం. 337/2024 ఇన్ ఇ.పి.నెం. 4/2022
ఇన్ ఒ.ఎస్. 271/16

బిట్వీన్: –
సోమిశెట్టి శ్రీనివాసులు ...D.H.R
Vs
యనమండ్ర దుర్గాప్రసాద్ **(Died)** అండ్ అదర్స్
జె.డి.ఆర్స్/ప్రపోస్డ్ పార్టీలు

R3. యనమండ్ర శ్రీరామలక్ష్మి,
W/o. దుర్గాప్రసాద్,
డోర్ నెం. 11-111,
నియర్ శాంతి కాన్వెంట్,
కమ్మవారి వీధి, భీమడోలు

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టు నందు మిమ్ములను చనిపోయిన వై. దుర్గాప్రసాద్ తరుపున వారసులుగా చేర్చమని కోరుచూ పిటీషనర్ పిటిషన్ దాఖలు చేసినారు. కావున మీరు **ది. 06-08-2025వ సం. తేదిన** పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణములను తెలియపరచవలెను. లేని యెడల మీ పరోక్షములో సదరు పిటిషను విచారించబడునని తెలుసుకునేది.

వి.జోత్స్న
ఏలూరు — పిటిషనర్ బై డి.హెచ్.ఆర్
తేది:19-07-2025 — ఏలూరు

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL (HONBLE V ADDL. DISTRICT JUDGE) ELURU
M.V.O.P.97/2025

Between:
Nallagachu Chetaneswar ...Petitioner
&
Parvathaneni Ramakrishna & Others ...Respondents

పై నంబర్ గ్రంథంలో R1 పర్వతనేని రామకృష్ణ వెంకటేశ్వరరావు, డ్రైవర్ ఆఫ్ మారుతీ సుజుకి వేగనర్ 2XI AGS బీరింగ్ నెం.AP 39 KK 1717, R/o.D.No.C-131, దుగ్గిరాల గ్రామం, పెదవేగి మండలం. R3: యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ లి॥, Rep by its డివిజినల్ మేనేజర్ ఆర్ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, కృష్ణాజిల్లా. అనువారికి నోటీసులు అమలు కొరకు పైకోర్టు వారి ఎదుట **ది.30-7-2025 తేది ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొండా యశ్వంత్
అడ్వకేట్, ఏలూరు.

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No.633/2024 & I.A.No.349/2018
in O.S.No.63/2018

Between:
కాసా సుబ్బారావు & వగైరాలు ...పిటిషనరులు/వాదులు
And
మోక ప్రసాదు & వగైరాలు ...రెస్పాండెంటులు/ప్రతివాదులు

To.
2nd Respondent/2nd Defendant:
Moka Vijaya Kumar, S/o.Vara Prasad @ Prasad, Private Employee, Maddipeta, H/o.Chinthaparru, Palakol Mandal, W.G.Dt.

పై నెంబరు పిటిషనులో 2 రెస్పాండెంటు /2వ ప్రతివాది హాజరు నిమిత్తం ది. **13-08-2025** సం॥తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంథము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
నరసాపురం — న్యాయవాది
ది. 18-07-2025 — పాలకొల్లు, ప.గో.జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) – కమ్ – జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S.No.141/2024

బిట్వీన్ :
కంబాల సుధాకర్ ...వాది
అండ్
బట్టు కమలకుమార్ & వగైరా ...ప్రతివాదులు

సమన్స్ టు :
D4: Battu Suresh, S/o.Late Satyanarayana, Age 37 Yrs, Male, Cultivation, D.No.17-2-14, 24th ward, Rustumbada, Narsapur, Narsapur Mandal, West Godavari District.

మీరు వాది కంబాల సుధాకర్, కంబాల నరసింహామూర్తి (Late) వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్)-కమ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ద్వారాను రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.12-8-25 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

చేగొండి శ్రీరంగరామమోహన్ బాలాజీ
అడ్వకేట్,
తేది. 18-7-2025 — నర్సాపూర్, ప.గో.జిల్లా.

గౌరవనీయులైన 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు
I.A.186,187,188/2024
O.S.540/2022

Between:
హర్షిత్ తాళం ...Plaintiff
And
R-3: ఘంటశాల పవన్ కళ్యాణ్, S/o.Late రామచంద్రవరప్రసాద్ @ మూర్తి రాజు, 25 సం॥లు,
R-4: ఘంటశాల ఖ్యాతి పుష్పశ్రీ ...రెస్పాండెంట్స్
D/o.Late రామచంద్రవరప్రసాద్ @ మూర్తి రాజు, 23 సం॥లు, D.No.24B-3-10, Opp.ప్రభ హాస్పిటల్, పత్తేబాద, ఓల్డ్ వేదరాజ్ థియేటర్ దగ్గర, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబరులో 3 మరియు 4 రెస్పాండెంటులు అయిన మీరు పైన పేర్కొన్న పైకోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గాను వాయిదా ది.**11-8-2025**వ తేదీన ఉన్నది. సదరు తేదీన ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.
//కోర్టు వారి అనుమతితో//

ఏలూరు — చోడే శ్రీనివాస్
తేది. 18-7-2025 — Plaintiff తరుపు న్యాయవాది
సెల్: 9290822001

మహారాజశ్రీ Vవ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో, ఏలూరు జిల్లా, ఏలూరు
ఎం.వి.ఓ.పి.నెం.107/2025

బిట్వీన్:
ముల్పూరి నాగ రాజ్యకుమారి & ఇతరులు ...పిటీషనర్స్
&
వీరంకి శివకృష్ణ & ఇతరులు ...రెస్పాండెంట్స్

STEPS PETITION FILED BEHALF OF THE PETITIONER UNDER ORDER-5 RULE - 20 of C.P.C.

పై నంబరు గ్రంథంలో 1వ రెస్పాండెంట్ శ్రీవీరంకి శివకృష్ణ, తండ్రి శ్రీనివాసరావు, స్కూల్ బస్ డ్రైవర్ నెం.AP 16TJ 1526, R/o.పమిడి ముక్కల గ్రామం, కృష్ణా జిల్లా. 3వ రెస్పాండెంట్ శ్రీ డివిజినల్ మేనేజర్ టాటా ఎఐజి జనరల్ ఇన్సురెన్స్ కంపెనీ, R/o.D.No.22C-1-58, 3rd ఫ్లోర్, సాయి హేమలత ప్లాజా, పవర్‌పేట, ఏలూరు. అనువారికి నోటీసులు అమలు కొరకు పైకోర్టు వారి ఎదుట ది.30-7-2025 తేది ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బద్ది వరహాలరావు, బద్ది శిరీష బద్ది అవినాష్, అడ్వకేట్స్,
ఏలూరు. సెల్: 9440653935.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, నరసాపురం
Creditor I.P.No.1/2024

Between:
భోగిళ్ళ పాపరావు ...పిటీషనర్
మరియు
1.ముత్యాల బాలాజీ
2.చెరుకూరి నాగక్ష్మి సాయి చంద్రిక
3.ది.అఫీషియల్ రిసీవర్ ...రెస్పాండెంట్స్

పై నెంబరర్ I.P లో పిటీషనర్ షెడ్యూల్ దాఖల ఆస్తిపై పిటీషన్ వేసినారు. అందు1వ రెస్పాండెంట్, 2వ రెస్పాండెంట్‌కు లాలూచీగా వ్రాసిన దస్తావేజు నెం.9272/2023 Dt.**14-09-2023,** SRO Palakol చెల్లదని మరియు సదరు ఆస్తిపై పిటీషనరుకు రావల్సిన బాకీ రాబట్టగలరని సదరు ఆస్తికి అఫీషియల్ రిసీవరు, ఏలూరు వారు అడ్మినిస్ట్రేషన్ చేయుదురు అని పై నెంబర్ పిటీషన్ దాఖలు చేయడమైనది. కావున ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తిపై రెస్పాండెంట్స్ మరియు ఎవరికైన ఆక్షేపణలు ఉన్నచో ది.23-07-2025వ తారీఖున ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కాని ప్లీడర్ ద్వారా గాని పైకోర్టు యందు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపగలరని ఇందుమూలముగా ప్రకటించడమైనది.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు, పాలకొల్లు SRO, ఎలమంచిలి రెవెన్యూ మండలం, కొంతేరు, అడవిపాలెం, పంచాయితీ ఏరియా కొంతేరు విలేజ్, R.S.No.259/2, R.S.No.259/3 అసెస్‌మెంట్ నెం.120 క్రొత డోర్‌నెం.2-20, బిల్డింగ్, 194-00 చ॥గ॥ల విస్తీర్ణం హద్దులు :
తూర్పు: 6 అడుగుల వెడల్పు రోడ్డు.
పడమర: ముత్యాల సుబ్బారావు బిల్డింగ్ స్థలం.
ఉత్తరం: పాలకొల్లు - దొడ్డిపట్ల మెయిన్ రోడ్డు.
దక్షిణం: ముత్యాల చినభద్రయ్య బిల్డింగ్ స్థలం.

కె.అమరేశ్వరరావు
నరసాపురం — అడ్వకేట్.
తేది. 20-07-2025 — సెల్: 9063777879

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
Dr.I.P.No.15/2025

శ్రీ దాసరి సుబ్రహ్మణ్యం ...పిటీషనర్
మరియు
బుద్ధరాజు ఆంజనేయరాజు మరియు వగైరాలు ...రెస్పాండెంట్స్

1వ రెస్పాండెంట్ : బుద్ధరాజు ఆంజనేయ రాజు, తండ్రి రామచంద్రరాజు, చినమిరం గ్రామం, భీమవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
2వ రెస్పాండెంట్ : బుద్ధరాజు రామలింగరాజు, తండ్రి రాఘవరాజు, చినమిరం గ్రామం, భీమవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
3వ రెస్పాండెంట్ : వేండ్ర లక్ష్మణస్వామి, తండ్రి నరసింహామూర్తి, ఎన్.ఆర్.పి.అగ్రహారం గ్రామం, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
4వ రెస్పాండెంట్ : కనకాల దుర్గారావు, తండ్రి బాబూరావు, చినమిరం గ్రామం, భీమవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
5. తిరుమల రామకృష్ణ, తండ్రి రాము, కృష్ణ ఫ్యాక్టరీ, చినమిరం గ్రామం, భీమవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
6. ది.అఫీసియల్ రిసీవర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు.

పై నెంబర్ పిటిషన్‌లో పిటిషనర్ అయిన దాసరి సుబ్రహ్మణ్యం గారిని ఇన్సాల్వెంట్‌గా ఉత్తర్వులు జారీ చేయమని మరియు అతని తాలుకా ఆస్తులను అఫీసియల్ రిసీవర్ గారిని అడ్మినిస్టరు చేయమని శ్రీయుత పై వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకొని యున్నారు. దానిపై ప్రజానీకానికి ఎవ్వరికైనను ఏమైన అభ్యంతరములు ఉన్నయెడల **ది.11-08-2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** శ్రీయుత పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి వారి ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను.

మల్లుల శ్రీనివాసరావు
ప్రాంతం: భీమవరం — వాది తరుపు అడ్వకేట్
ది. 19.07.2025 — భీమవరం. సెల్:9441170494